ప్రజాశక్తి
గురువారం 28 మార్చి 2024 5 అనంతపురం






అసంతృప్తులను

దారికి తెచ్చేరా..?

◆ నేడు ఉమ్మడి జిల్లాలో చంద్రబాబు పర్యటన

◆ ఏర్పాట్లను పూర్తి చేసిన టిడిపి నాయకులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలు సమీస్తున్న తరుణంలో తెలుగుదేశం పార్టీకి సంబంధించి టిక్కెట్లు ఖరారైన చోట కొన్నింటిలో అసంతృప్తులు నెలకొన్నాయి. అభ్యర్థులు కలుపుకుపోయే ప్రయత్నాలు చేసినా పెద్దగా సర్దుబాటు అవుతున్న పరిస్థితుల్లేవు. కొన్ని చోట్ల అయినట్టు ఉన్నా లోలోన మాత్రం ఎన్నికల్లో తమ సత్తా చాటుదామన్న ఆలోచనలో ఉన్నట్టు చర్చ నడుస్తోంది. ఒకవైపు అధికార వైసిపి ఇప్పటికే ఎన్నికల్లో గెలుపునకు అవసరమైన అన్ని రకాల వ్యూహాలను అమలు చేస్తోంది. టిడిపి మాత్రం ఇప్పటికీ గ్రూపు తగాదాలతో సతమతమతం అవుతూనే ఉంది. ఈ నేపథ్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. రాత్రికి ఇక్కడే బస చేయనున్నారు. ఈ సమయంలో అసంతృప్తులపైనా దృష్టి సారించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఆయన పర్యటించే శింగనమల, కళ్యాణదుర్గం, మడకశిర నియోజకవర్గాల్లో నేతల మధ్య సఖ్యతలేదు. ధర్మవరం టిక్కెట్టు టిడిపికే ఇవ్వాలని పరిటాల శ్రీరామ్ వర్గీయులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆందోళనలు సైతం చేపడుతున్నారు. టిక్కెట్లు ఖరారు కాని అనంతపురం అర్బన్, గుంతకల్లు, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థులపై సందిగ్ధతత కొనసాగుతోంది. టిక్కెట్టు కోసం నేతలు ఎవరికి వారుగా పోటీలు పడుతూనే ఉన్నారు. ఒకరికిస్తే మరొకరు సహకరించే పరిస్థితులు కనిపించడం లేదు. గుంతకల్లు టిక్కెట్టు మాజీ మంత్రి జయరాంకు ఇవ్వడానికి వీల్లేదని స్థానిక నేతలు అక్కడ నిరసనలు చేపడుతున్నారు. వీటన్నింటినీ ఈ పర్యటనలో ఏ రకంగా కొలిక్కి తీసుకొస్తారన్నది పార్టీ శ్రేణులు ఎదురు చూస్తున్నాయి.


బాబు పర్యటన ఇలా...

చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం 10.45 గంటలకు మదనపల్లి నుంచి హెలిక్యాప్టర్‌లో ప్రసన్నాయపల్లి వద్ద దిగుతారు. అక్కడి నుంచి నేరుగా రాప్తాడు బస్టాండ్ సర్కిల్‌కు చేరుకుంటారు అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం ఆర్డీటీ అతిథి గృహంలో బస చేస్తారు. మధ్యాహ్నం 2.20 గంటలకు బస చేసిన ప్రాంతం నుంచి బయలుదేరి బుక్కరాయసముద్రం చేరుకుంటారు. అక్కడ అంబేద్కర్ సర్కిల్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4.15 గంటలకు ప్రసన్నాయపల్లి నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 5.10 గంటలకు కదిరికి చేరుకుంటారు. మహాత్మాజ్యోతిబా పూలే సర్కిల్‌లో సాయంత్రం 7.30 గంటలకు బహిరంగ సభ ముగుస్తుంది. అక్కడే రాత్రికి బస చేస్తారు.

కమలంలో కాక..!



◆ ధర్మవరం సూరికి కాదని సత్యకుమార్‌కు అవకాశం ◆ హిందూపురం పార్లమెంట్ తీసుకోలేదని పరిపూర్ణానంద గుర్రు



గోనుగుంట్ల సూర్యనారాయణ



సత్యకుమార్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి, జనసేనతో కలసి సీట్లు సర్దుబాటు చేసుకున్న బిజెపిలో టిక్కెట్ల కాక పుట్టిస్తున్నాయి. గత ఎన్నికల్లో పోటీచేసి ఒక్క శాతం ఓట్లు కూడా దక్కని ఆ పార్టీకి ఈసారి పొత్తులో నెగ్గుకురావాలని చూస్తోంది. అయితే సీట్ల సర్దుబాట్లతోపాటు, టిక్కెట్ల కేటాయింపులు కాకపుట్టిస్తున్నాయి. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్టు పొత్తుల్లో భాగంగా బిజెపి తీసుకుంది. ఈ నియోజకవర్గంలో ముందు నుంచి సొంతగా పట్టు కలిగిన మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్య నారాయణకు ఇస్తారని భావించారు. చివరి వరకు అదే పేరు వినిపించింది. అంతేకాకుండా అధిష్టానం నుంచి సంకేతాలున్నాయంటూ ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న శ్రీరామ్ వర్గీయులు ఆయనకు ఇవ్వడానికి వీల్లేదని నిరసనలు చేపట్టారు. ఇతరులెవరికిచ్చినా సహకరిస్తామని ప్రకటించారు. అయినా స్వతహాగా ఈ నియోజకవర్గంలో బిజెపికి అంతటి బలం లేదు. ఒక్క శాతం ఓటు బ్యాంకు కూడా లేదన్నది పూర్వపు ఎన్నికల్లో స్పష్టమైంది. ఈ నేపథ్యంలో జి.సూర్యనారాయణకే బిజెపి టిక్కెట్టు వస్తుందని భావించారు. చివరి నిమిషంలో బిజెపి అభ్యర్థుల్లో మార్పులు చేపట్టింది. హిందూపురం పార్లమెంట్‌కు పోటీ చేయాలనుకుంటున్న సత్యకుమార్‌ను తీసుకొచ్చి ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించింది. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గంలో సత్యకుమార్‌కు ఏ మాత్రం పట్టులేదు. కనీసం ఈ ప్రాంతంలో ఎటువంటి సంబంధాలూ లేవు. ఒకరకంగా చెప్పాలంటే ఈయనెవరో కూడా ఇక్కడి ప్రజలకు తెలియదు. అటువంటి వ్యక్తిని ఇక్కడ పోటీలో పెట్టడం అందరనీ విస్మయానికి గురిచేస్తోంది. ఇంకో వైపు సత్యకుమార్ కూడా అసెంబ్లీ కంటే పార్లమెంటు వైపే ఎక్కువ మొగ్గు చూపినప్పటికీ బిజెపి ఇక్కడి నుంచి బరిలో దింపాలని నిర్ణయించింది.

కూటమిలో భాగంగా హిందూపురం పార్లమెంటు టిక్కెట్‌ను ఆశించిన వారిలో పరిపూర్ణానంద స్వామి ఉన్నారు. ఈ స్థానం బిజెపికి కేటాయిస్తున్నట్టు ముందుగా ప్రకటనలూ వచ్చాయి. అయితే ఆఖరు నిమిషంలో ఈ నియోజకవర్గం పొత్తుల్లో టిడిపికే ఉండిపోయింది. దీనిపై పరిపూర్ణానందస్వామి అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. బిజెపి టిక్కెట్టు ఇవ్వకున్నా స్వతంత్రంగా పోటీ చేస్తామనని ప్రకటించారు. ఇలా బిజెపిలో టిక్కెట్ల గోల నడుస్తోంది. సత్యకుమార్ ధర్మవరం నుంచి పోటీ చేస్తే మాజీ ఎమ్మెల్యే జి.సూర్యనారాయణ ఏ మేరకు సహకరిస్తారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఆయనకే టిక్కెట్టు ఉంటుందని భావించి ప్రచారం కూడా ప్రారంభించుకున్నాక మార్పు జరగడంతో ఆయన తీవ్రమైన అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. స్వతంత్రగా పోటీ చేస్తే ఎలాగుంటుందన్న ఆలోచనలోనూ ఉన్నట్టు సమాచారం. అదే జరిగితే బిజెపి పరిస్థితి మరింత దయనీయంగా మారే అవకాశముంది.



ఉరవకొండ సెబ్ స్టేషన్ ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ప్రజాశక్తి-ఉరవకొండ

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఆయన గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కణేకల్లు సెబ్ స్టేషన్లను సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా స్టేషన్లు కర్నాటక రాష్ట్ర సరిహద్దులో ఉండడంతో మద్యం అక్రమ రవాణాపై కఠినచర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతపురం జిల్లా అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం. శ్రీరామ్‌తో కలిసి అంధ్ర-కర్నాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన డోనేకల్లు, విడపనకల్లు చెక్‌పోస్ట్‌లను తనిఖీ చేసి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో కర్నాటక మద్యం సరిహద్దులు దాటకూడదని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఇది కొలమానమని సిబ్బందికి సూచించారు. మద్యం అక్రమ రవాణా, గోడౌన్లు, పాత నేరస్తులపై ప్రత్యక నిఘా పెట్టలని జిల్లా సెబ్ అధికారులను ఆదేశించారు.

మాదక ద్రవ్యాలను నిషేధించాలి



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ఐద్వా ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజానికి ప్రమాదకరంగా తయారైన మాదక ద్రవ్యాలను నిషేధించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. మాదక ద్రవ్యాలను నిషేధించి యువత, సమాజాన్ని కాపాడాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో మహిళలు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వి.సావిత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల మత్తులో యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ సమాజానికి హాని కలిగిస్తున్నారని తెలిపారు. స్కూల్ స్థాయి నుంచే పిల్లలకు మాదకద్రవ్యాలు అందుతున్న దుస్థితి నెలకొనడం ప్రమాదంగా ఉందన్నారు. విశాఖపట్నంలో కోట్ల రూపాయల ఖరీదైన కొకైన్ దొరికిందంటే ప్రభుత్వాలు ఎంత మేరకు మాదకద్రవ్యాల నిషేధంపై పనిచేస్తున్నాయో తెలుస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి డ్రగ్స్ వెనకాల ఎవరూ ఉన్నారో తేల్చాలన్నారు. సిబిఐ సమగ్ర విచారణ జరిపి నిందితులన కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. మాదక ద్రవ్యాల పట్ల ప్రభావితం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు సాయిలక్ష్మి, జిల్లా అధ్యక్షులు శ్యామల, నాయకులు జ్యోతి, రామానుజులమ్మ, రేణుక, గీత, రేవతి పాల్గొన్నారు.

ఎన్నికలకు అన్ని విధాలా సన్నద్ధం

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి



అధికారులతో మాట్లాడుతున్న ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం

సాధారణ ఎన్నికల కోసం అన్ని విధాలా సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నాడు రిటర్నింగ్ అధికారులతో సాధారణ ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్కోర్‌ను బలోపేతం చేశామన్నార. ఈ విషయాన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, ఎక్కడా ఎంసిసి ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు. రాజకీయ పార్టీల ప్రచారం, సమావేశాల, వాహనాలు, లౌడ్ స్పీకర్, తదితర అన్ని వాటికి అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్కోర్ యాప్ దరఖాస్తులకు నిర్దేశిత సమయంలోగా రిటర్నింగ్ అధికారులు అనుమతులు ఇవ్వాలన్నారు. క్యాండిడేట్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసుకుని ఎన్కోర్ యాప్, అనుమతులపై అభ్యర్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో పోలింగ్ పర్సనల్‌కు సంబంధించి శిక్షణ నిర్వహించాలని, ఏప్రిల్ 12 నుంచి 15వ తేదీలోగా ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించా లన్నారు. ఆయా నియోజకవర్గాల్లో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు అవగాహన కార్యక్రమాలు విస్తతంగా చేపట్టాలన్నారు. పోలింగ్ పర్సనల్స్ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా ఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, రాణిసుస్మిత, కరుణకుమారి, వెన్నెల శీను, వి.శ్రీనివాసులు రెడ్డి, వసంతబాబు, నోడల్ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, ఎన్ఐసి డిఐఒ రవిశంకర్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి


సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పని చేయాల్సి ఉంటుందని కలెక్టర్ ఎం.గౌతమి తెలియజేశారు. కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం సాయంత్రం సాధారణ ఎన్నికలు - 2024పై జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోసం జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు పనిచేస్తుందని, ప్రతి ఆర్ఒ వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 1950, టోల్ ఫ్రీ నెంబర్లు 1800-4258802, 1800-4258803, 1800-4258804కు డబ్బు పంచుతున్నా, ఓటర్లను ప్రలోభ పెడుతున్నా, ఇతర ఎన్నికలకు సంబంధించి ఏ సమస్య ఉన్న ఫోన్ చేయవచ్చున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఫోన్ నెంబర్లు 08554-231722, 08554-231922, 08554-232922లకు ఏవైనా ఫిర్యాదులు తెలపవచ్చున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ కూడా మూడు షిఫ్టుల్లో పని చేస్తోందన్నారు. సీ-విజిల్ యాప్‌లో ఎంసీసీకి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులైన చేయవచ్చని తెలియజేశారు. అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, అడిషినల్ ఎస్పీలు విజయ్ భాస్కర్ రెడ్డి, రామకృష్ణ, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

1 నుంచి గేట్స్‌లో పాలిసెట్ కోచింగ్

గుత్తి : పాలిసెట్-2024 కోసం పట్టణ శివారులోని గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు ఆ కళాశాల యాజమాన్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గుత్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉచితంగా బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. వివరాల కోసం 83339 87201 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అనంత సీటును చంద్రబాబుకు కానుకగా ఇద్దాం

టిడిపి అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రభాకర్ చౌదరి



టిడిపి విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోకవర్గం ఎన్డీఏ కూటమి నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నామని, ఈసీటును గెలిచి చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇద్దామని అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి తెలియజేశారు. బుధవారం నాడు రాయల్ ఫంక్షన్ హాల్‌లో టిడిపి అర్బన్ విస్తతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి పొత్తు ధర్మంలో భాగంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే సీటుపై చర్చించారని తెలిపారు. బూత్ స్థాయి నుంచి టిడిపి కేడర్ పటిష్టంగా ఉన్న నేపథ్యంలో కూటమి అభ్యర్థిగా టిడిపికి చెందిన వారికే సీటు కేటాయించబోతున్నారని తెలిపారు. ప్రతిపక్ష సమయంలో అధికార పార్టీ ఆగడాలు, అన్యాయాలను ఎదురించి కార్యకర్తలను కాపాడుకుంటూ తాను పని చేస్తూ వచ్చానన్నారు. ఎన్నికలకు సంబంధించి 40 రోజుల పాటు సమిష్టిగా ప్రజలతో మమేకమై పని చేయాలన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం, అనంతపురం అర్బన్‌లో టిడిపి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు. టిడిపి ప్రభుత్వ పాలనలో ఐదు సంవత్సరాలు అనంతపురం అర్బన్‌లో అభివృద్ధి, సంక్షేమం చేసి చూపించామన్నారు. చేసిన పనిని ప్రజలకు చెప్పుకోవడంలో విఫలం చెందామన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి మ్యానిఫెస్టోను ప్రతి ఇంటికీ చేరవేసి ఓట్లు రాబట్టాలన్నారు. అర్బన్ టికెట్ విషయంలో నెలకొన్న గందరగోలానికి తెర ఎప్పుడంటూ కార్యకర్తలు ప్రశ్నించగా 'ఎమ్మెల్యే సీటు నాదే.. గెలుపు మనదే' అని ప్రభాకర్ చౌదరి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సాలార్ బాషా, సాకే గంపన్న, తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళి, మారుతి కుమార్ గౌడ్, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, గాజుల ఆదెన్న, రాజారావు, స్వప్న, విజయశ్రీ రెడ్డి, సరళ, జానకి, కష్ణవేణి, వసుంధర పాల్గొన్నారు.

ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయాల్సిందే

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి సంక్షేమం కోసం సేవలు అందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి) ఎఫ్‌సిఆర్ఎను తక్షణమే రెన్యూవల్ చేసి పేదలకు అందుతున్న ప్రోత్సాహక కార్యక్రమాలను తోడ్పడాలని దళిత ప్రజా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రాచానపల్లి ఉప సర్పంచి వరలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్ నేతృత్వంలో దళిత ప్రజా సంఘాల నేతలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్ఎను రెన్యూవల్ చేయాలని ప్లకార్డులు చేత పట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిసిఆర్.దాస్, ఎల్లన్న, వరలక్ష్మి మాట్లాడుతూ ఆర్డీటీ లాంటి సంస్థను ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహకాలు ఇచ్చి ప్రజలకు సేవలు అందేలా చూడాల్సింది పోయి నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడటం సరికాదన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

చివరి రోజు 2203 మంది గైర్హాజరు : డిఇఒ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఈ నెల 18వ తేదీ ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారం సజావుగా ముగిసాయి. జిల్లా వ్యాప్తంగా చివరి రోజు జరిగిన బయలాజీ, సోషియల్ పరీక్షలకు 2,203 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తెలిపారు. రెగ్యులర్, ప్రయివేట్ కలిపి మొత్తం 33,868 మంది హాల్ టికెట్స్ తీసుకున్నారని, అందులో బయలాజికల్ పరీక్షకు 2,203 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను డిఇఒ సందర్శించి సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డిఇఒ మాట్లాతూ ఉదయం నిర్వహించిన బయలాజికల్ సైన్స్ పరీక్షను 31,665 మంది విద్యార్థులు రాసినట్లు తెలిపారు. డిఇఒ వెంట పరీక్షల విభాగం ఎసి గోవిందనాయక్ ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-నార్పల

మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ లక్ష్మినారాయణ హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం అధికారులు, ఎమ్మార్పీఎస్ నాయకు లతో సమావేశం నిర్వహించారు. స్థానిక అనంతపురం రోడ్డులోని జగనన్న కాలనీ సర్వే నెంబర్-11లో కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి దౌర్జన్యంగా ఇల్లు కడుతున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరకుని ఆక్రమణలను అడ్డుకున్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించా రు. ఎవరైనా ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహా, విఆర్వోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ లక్ష్మినారాయణ

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

బొమ్మనహాల్ : మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుందన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తు న్నాయి. అధికార పార్టీ నాయకుల పనుల ట్రాక్టర్ సాయంతో ఇసుకను ఓ చోట నిల్వ ఉంచి రాత్రివేళ అక్కడి నుంచి టిప్పర్లతో కర్నాటక తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ. 3వేల నుంచి రూ. 6వేల వరకు విక్రయిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారు, రాజకీయ నాయకులు, అధికార పార్టీ నాయకులు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు పేర్కొంటు న్నారు. మరుగుదొడ్లు, ఇళ్లు, తదితర అవసరాలకు ఇసుక కోసం వెళ్తే అధికారులు నిబంధనల పేరుతో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని నిరుపేదలు వాపోతున్నారు.

కదిరిదేవరపల్లి

రైలు రద్దు గడువు పొడిగింపు

రాయదుర్గం : కదిరిదేవరపల్లి-తిరుపతి నడుమ నడిచే రైలు (07589/07590) సర్వీసు పాక్షిక రద్దు గడువు ను పొడిగించినట్లు నైరుతి రైల్వే అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ బిఎల్ శివకుమార్ బుధవారం ఓ ప్రక టనలో తెలిపారు. రైలు మార్గం నిర్మాణం, మరమ్మతుల కారణంగా 3 నెలల క్రితం ఈ రైలు సర్వీసును కదిరిదేవరపల్లి నుంచి గుంతకల్లు వరకు ఏప్రిల్ మొదటి తేదీ వరకూ రద్దు చేసిన విషయం తెలిసిందే. నిర్మాణ పనులు పూర్తికానందు వల్ల మే 1 వ తేదీ వరకూ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రైలు గుంతకల్లు నుంచి తిరుపతి మధ్య మాత్రమే ప్రయాణిస్తుంది. ప్రయాణికులు గమనించాలని కోరారు.

తొండపాడు ఆలయ హుండీ లెక్కింపు

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయానికి రూ. 15.72 లక్షల ఆదాయం లభించింది. గతేడాది సెప్టెంబర్ 22 నుంచి ఈ ఏడాది మార్చి 27వ తేదీ వరకూ భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం ఇన్‌ఛార్జ్ ఇఒ రాణి సమక్షంలో లెక్కించారు. రూ. 15,72,383 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్, అర్చకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై కంట్రోల్ రూమ్

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జి.శ్రీనివాసులు, డిఇఇ వైరాం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యపై ప్రజల వినతులు స్వీకరించి పరిష్కరించేందుకు 08552 291088, 94940 96427 నెంబర్లకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల లోపు ఫోన్ చేయాలన్నారు.

'ప్రజాగళం'ను జయప్రదం చేయండి

బండారు శ్రావణిశ్రీ

నార్పల : బుక్కరాయసముద్రంలో గురువారం టిడిపి అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగే ప్రజాగళం కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని శింగనమల నియోజకవర్గ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్య కమిటీ సభ్యుల ఆలం నరసానాయుడు పిలుపు నిచ్చారు. రాష్ట్రంలోని యువత, మహిళలు, బిసిలు, దళితులు, మైనారిటీలు, ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవితం ఇవ్వాలన్నదే టిడిపి లక్ష్యమన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమిని గెలిపించాలని కోరారు.

పుట్లూరు : బుక్కరాయసముద్రంలో గురువారం టిడిపి అధినేత చంద్రబాబు పాల్గొనే 'ప్రజాగళం' యాత్రను జయప్రదం చేయాలని మండల టిడిపి నాయకుడు చవ్వా కులశేఖరరెడ్డి (బాబు) పిలుపునిచ్చారు. మండలం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఒప్పంద ఉద్యోగి మృతి

బొమ్మనహాల్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఒప్పంద ఉద్యోగిగా పని చేస్తున్న పురుషోత్తం (40) బళ్లారి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పురుషోత్తంకు ఇటీవల బిపి ఎక్కువై బ్రెయిన్ స్ట్రోక్, పెరాలసిస్ రావడం తో బళ్లారి ప్రభుత్వాసుపత్రితో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందగా స్థానిక వైద్యుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు.

భర్త కనపడలేదని ఫిర్యాదు

పుట్లూరు : మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన మిడుతూరు మహబూబ్‌బాషా (42) కనిపించడం లేదని అతడి భార్య రమీజ బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. హుస్సేన్ పీర కొడుకు మహబూబ్‌బాషా ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లి పోయి తిరిగి రాలేదని భార్య రమీజా ఫిర్యాదులో పేర్కొనడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కోర్టులో
ఎం.వి.ఓ.పి.నంబర్ 245/2019

ఈ.మధు మోహన్ గౌడ్. ...అర్జీదారు

ఎదిరి

ఈ.రామాంజనమ్మ వగైరా. ...రెస్పాండెంట్లు

4వ రెస్పాండెంట్ కు నోటీసులు

4) ఈడిగ సుధాకర్ తండ్రి ఈ.చిన్న కాశన్న, మేజర్, R/o ఇంటి నం: 15/1832, సి.బి రోడ్, తాడిపత్రి, అనంతపురం జిల్లా.

పై నంబరు ఎం.వి.ఓ.పిలో ఇ.మహేందర్ గౌడ్ అనునతడు 14/02/2019వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయినందున అతనికి నష్టపరిహారము రూ. 5,00,000/-లు ప్రమాదము జరిగిన రోజు నుండి 18% ప్రకారం వడ్డీతో మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో 4వ రెస్పాండెంట్ అయిన నీకు ఆక్షేపనలు ఉన్నా 16/04/2024వ తేదీ పగలు 10:30 గం॥లకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా తేది : 16/04/2024

ఎం.నాగేశ్వరరెడ్డి,
వై.రాఘవేంద్ర రెడ్డి,
అర్జీదారుపరం అడ్వకేట్లు,
కర్నూలు.

వీధి కుక్కలను నియంత్రించండి

మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో వీధి కుక్కలను నియంత్రించి ప్రజలకు రక్షణ కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పట్టణంలో వీధి కుక్కలు లెక్కలేనంతగా పెరిగిపోయాయని ప్రజలు వీధుల్లో, ఇంటి ముందు, రోడ్లపై నడవాలంటే భయపడుతు న్నారన్నారు. బైక్‌లపై వెళ్లే వారి పరిస్థితి మరింతగా దారుణంగా ఉందని, కుక్కలు వాహనాల వెంట పరిగెడుతూ కరవడానికి ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇప్పటికే చాలామంది ప్రజలు కుక్కకాటుకు గురై ఆసుపత్రులకు వెళ్లారన్నారు. కావున వీధి కుక్కలను నియంత్రించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రమేష్, కెవిపిఎస్ పట్టణ అధ్యక్షుడు రామునాయక్, డివైఎఫ్ఐ నాయకులు సునీల్‌కుమార్, ఓబులేసు, షాషా ఉన్నారు.



కమిషనర్ వెంకట రమణయ్యకు వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు

మహిళ మృతి కేసులో ముగ్గురు అరెస్టు

భర్త కొట్టడం వల్లే అంజలి మరణం : డీఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కలెక్టరేట్ ఎదుట అంజలి(29) అనే మహిళ ఆకలితో చనిపోయిందని రెండు రోజుల క్రితం పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనిపై ఆలస్యంగా స్పందించిన పోలీసు యంత్రాంగం ఘటనపై సమగ్ర విచారణ జరిపి వివరాలను సేకరించారు. మంగళవారం రాత్రి అనుమానాస్పద కేసు నమోదు చేశారు. బుధవారం నాడు అంజలి కుటుంబ సభ్యులను విచారణ చేశారు. ఖననం చేసిన అంజలి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించారు. ఆమె ఆకలితోకాకుండా భర్త కొట్టడంతోనే చనిపోయిందని ప్రాథమికంగా నిర్ధారించి కేసు నమోదు చేశారు. ఇందులో భర్తతోపాటు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను అనంతపురం డీఎస్పీ రాఘవరెడ్డి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం వివరాలను వెల్లడించారు. మృతురాలు అంజలి భర్త రాజు తాగుడుకు బానిసై కుటుంబ పోషణను పూర్తిగా పట్టించుకోవడం మానేశాడు. దీన్ని ఆసరాగా చేసుకుని బేల్దారి దస్తగిరి, బేల్దారి బాలులు మంచి జీవితాన్ని కల్పిస్తామని అంజలినిని నమ్మించి శారీరకంగా వాడుకుని మోసం చేసినట్టు డీఎస్పీ రాఘవరెడ్డి తెలిపారు. అదే క్రమంలో ఈనెల 23వ తేదీ ఉదయం బాలు, దస్తగిరిలు ఆటోలో అంజలిని తీసుకెళ్లి కొన్ని గంటల తరువాత మళ్లీ ఇంటికి తీసుకొచ్చారు. ఈ విషయంలో అంజలి భర్త రాజు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి అంజలితో గొడవపడ్డాడు. నిత్యం మద్యానికి బానిసై పనికెళ్లకుంటే కుటుంబ పోషణ ఎలాగని, అందుకే తాను బేల్దారి పనికెళ్లి వచ్చానని అంజలి చెప్పింది.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవరెడ్డి

అదే సమయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అంజలిపై భర్త రాజు దాడి చేశాడు. తీవ్రంగా కొట్టడంతో గాయాలపాలైన అంజలి మృతి చెందింది. మృతి చెందిన తీరును చూసి ఆమె అకలి బాధతో మరణించినట్లు ప్రచారం అయ్యింది. ఈ ఘటన ప్రచారం కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో వెల్లడైన ప్రకారం భర్త రాజు, నమ్మించి మోసం చేసిన దస్తగిరి, బాలులపైనా కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆదరించండి

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

వైసిపి పాలనలో రాష్ట్రంలో అమలైన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని మ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి ప్రజలను కోరారు. 'ఇంటింటికీ మన విశ్వన్న' ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన పట్టణంలోని 11వ వార్డు,కొండప్ప బావి కాలనీల్లో పర్యటించారు. ముందుగా రామలింగచౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. మీడియాతో మాట్లాడుతూ 14 ఏళ్ల సిఎంగా ఉన్న చంద్రబాబు పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. మళ్లీ అధికార దాహంతో మోసపూరిత హామీలు చేస్తున్నారని వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. సిఎం జగన్ 99 శాతం హామీలను అమలు చేసి పేదల తలరాతలను మార్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వీరన్న, సర్పంచి లలిత, ఎంపిపి నరసింహులు, జడ్పిటిసి పార్వతమ్మ, ఉప సర్పంచి వన్నప్ప, కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, ఎంపిటిసిలు ఈడిగ ప్రసాద్, వన్నూర్ సాబ్, నాయకులు బాను బేగం, వడ్ల షేక్షావలి, మీరం బాషా, గోవిందు, జోగి వేంకటేష్, చంద్రమ్మ, ఎర్రిస్వామి, బసవరాజు, తిప్పయ్య, ఓబన్న, ఆసిఫ్, మొమిన్ జిలాన్, తాజుద్దీన్, అన్వర్, ఇంతియాజ్, రఫిక్, శంకర్, బాలాజీ, జగన్నాథ్, మల్లికార్జున, ఓబుళమ్మ, శర్మాస్, వాసు దేవుడు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న విశ్వేశ్వరరెడ్డి



ప్రజలకు సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : డీఎస్పీ

బొమ్మనహాల్ : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతా వరణంలో సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. బొమ్మనహాల్, ఉద్దేహాల్ గ్రామాల్లో బుధవారం డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ప్రధాన రహదారి పై డీఎస్పీ మాట్లా డుతూ ఎన్నికల్లో ప్రజలందరూ నిర్భయంగా ఓటు వేయాలన్నారు. తగాదాలు, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. పోలింగ్ రోజున ఎక్కడా గుంపులుగా ఉండరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసు నమోదు చేస్తామన్నారు. డీఎస్పీతో పాటు రాయదుర్గం సిఐ ప్రసాద్, స్థానిక ఎస్ఐ శ్రీనివాసులు, బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

రాయదుర్గం : రాజకీయ పార్టీలు, ప్రతినిధులు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తహశీల్దార్, సహాయ ఎన్నికల అధికారి చిట్టిబాబు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే పార్టీలు, ప్రతినిధులు తప్పనిసరిగా ఎన్నికల అధికారుల వద్ద అనుమతి పొందా లన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించాలన్నా, మైక్ సెట్‌లు, వాహనాలకు అనుమతి తప్పనిసరి అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థన స్థలాల వద్ద ఎన్నికల ప్రచారం చేపట్టరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. నోటిఫికేషన్ తేదీ వరకూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రామ్‌చరణ్ అభిమానుల రక్తదానం

రాయదుర్గం : గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా బుధవారం మెగాస్టార్ చిరంజీవి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని గోసబావి వీధి బృందావనంలో రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 28 మంది రక్తదాతలకు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి బిఎం నాదల్ ప్రశంసా పత్రాలు అందజేశారు. చిరంజీవి, రామ్‌చరణ్ అభిమానుల సేవా కార్యక్ర మాలు ప్రశంసనీయమనికొని యాడారు. సేకరించిన రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అందజేస్తామని చిరంజీవి అభిమానుల సంఘం అధ్యక్షుడు హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డిటి గౌతం, చిరంజీవి, రామ్‌చరణ్ అభిమానులు పాల్గొన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

స్వదేశీ ఉత్పత్తులపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఇటుకలపల్లి గ్రామంలో ఏడు రోజుల పాటు స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. చివరి రోజైన బుధవారం గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామస్తులకు స్వదేశీ ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మన దేశంలో తయారయ్యే వస్తువులను వాడడం వల్ల స్వయం ఉపాధితో పాటు తక్కువ ధరకే వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. కావున ప్రతిఒక్కరూ దేశీయ వస్తువులనే వాడాలని సూచించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ అనంతరాముడు పాల్గొని మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు వారంలో రోజుల పాటు గ్రామంలో చేసిన సేవలను కొనియాడారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మూర్తి మాట్లాడుతూ సేవాభావం వల్ల విద్యార్థులు క్రమశిక్షణగా ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సురేంద్ర నాయుడు, ఎన్ఎసెస్ ప్రోగ్రామం ఆఫీసర్ ఖలీల్‌బాషా, నవీన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ చేపట్టిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తా

శింగనమల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-నార్పల

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తానని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు తెలిపారు. 'మన ఊరికి-మన వీరా' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని దుగ్గం, సిద్ధరాచెర్ల, బోయకొట్టాల, గొల్లపల్లి, కమ్మకొట్టాల, మాలవాండ్లపల్లి, బండ్లపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి వైసిపి సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక బిడ్డగా వస్తున్నా అందుబాటులో ఉంటా.. ఆదరించండి.. మీకు సేవకుడిగా పని చేస్తానని హామీ ఇచ్చారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఎన్నికల యుద్ధంలో పేదల పక్షాన నిలిచిన జగన్‌ను మరోసారి సిఎం చేసుకోవాలన్నారు. చంద్రబాబు పాలనలో విద్య, వైద్యం సంక్షేమానికి తూట్లు పొడిచారన్నారు. జగనన్న చేసిన సంక్షేమాన్ని చూసి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్‌కు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఎం.వీరాంజనేయులు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేద్దాం : మాజీ ఎమ్మెల్యే

పామిడి : 'శంఖారావం' రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆయన బుధవారం పట్టణంలో మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. జితేంద్రగౌడ్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్, మినీమేనిఫెస్టోలోని పథకాలతో పాటు వైసిపి అవినీతి, అరాచక పాలన గురించి ప్రతి గ్రామం, వార్డు, బూత్‌లో ప్రజలకు వివరించాలన్నారు. అలాగే గురువారం బుక్కరాయసముద్రంలో జరిగే ప్రజాగళం కార్యక్రమానికి పెద్దఎత్తున తరలి వెళ్లి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పామిడి, గుత్తి పట్టణం, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



'శంఖారావం' రిజిస్ట్రేషన్‌పై ఆరా తీస్తున్న జితేంద్రగౌడ్

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

బెళుగుప్ప : వేసవి దృష్ట్యా మండల వ్యాప్తంగా ఏ గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకో వాలని ఎంపిడిఒ సుబ్బరాజు ఆయా గ్రామ పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. గ్రామాల్లో సమస్యలపై బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపి డిఒ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికుల హాజరు వివరాలను జెఎస్ఎస్ యాప్‌లో నమోదు చేయాల న్నారు. మార్చి 31వ తేదీలోపు ఇంటి పన్ను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి మాధవరెడ్డి, అసిస్టెంట్ ఇంజినీరింగ్ శివారెడ్డి, పంచాయతీ సెక్రటరీలు వెంకటేశులు, శ్రీరాములు, జగదీష్ కుమార్ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ఉరవకొండ : టిడిపితోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమసింహ పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన విడపనకల్లు మండలంలోని ఉండబండ గ్రామంలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి పయ్యావుల కేశవ్‌ను మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆయన వెంట మండల కన్వీనర్ బీడీ చిన్నమారయ్య, తెలుగు యువత జిల్లా కార్యదర్శి వన్నూరుస్వామి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న పయ్యావుల విక్రమసింహా

వైసిపి నాయకునికి పరామర్శ

శింగనమల : మండలంలోని చిన్నజలాలపురం గ్రామానికి చెందిన వైసిపి మండల మాజీ కన్వీనర్ పట్నం నగేష్ మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. విషయం తెలిసిన వెంటనే వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, చామలూరు రాజగోపాల్, మిద్దె కుళ్లాయప్ప ఆయన ఇంటికి వెళ్లి నగేష్ కుటుంబాన్ని పరామర్శించారు అనంతరం తోటను పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్ఐ చంద్రశేఖర్, పోలీసులు తోటను పరిశీలించి దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, లోలూరు సర్పంచి నల్లప్ప రెడ్డి, చక్రపాణిరెడ్డి, మధురెడ్డి, జెల్లీ గోపీ యాదవ్, మధురెడ్డి, మైసూరారెడ్డి, పట్నం నరేష్, కొండారెడ్డి, వెంకటరాముడు పాల్గొన్నారు.

గార్లదిన్నెలో ఎమ్మెల్యే తనయుడి ప్రచారం

పెద్దపప్పూరు : అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకు అందాలంటే మరోసారి వైసిపిని ఆదరించాలని యువ నేత సాయిప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు సాయి ప్రతాపరెడ్డి బుధవారం సర్పంచి హేమ సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో గార్లదిన్నె గ్రామంలో ప్రచారం చేపట్టారు. నవరత్నాలు లబ్ధిదారులకు అందాలంటే వైసిపితోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కేతిరెడ్డి పెద్దారెడ్డిని మరొకసారి గెలిపించాలని ప్రజలకు కోరారు. కార్యక్రమంలో వేమనాథరెడ్డి, రామిరెడ్డి, రవిప్రసాద్‌రెడ్డి, రామ్మూర్తిరెడ్డి, లక్ష్మీరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, రాంబాబు, వెంకటేశ్వరరెడ్డి, కమలాకర్‌రెడ్డి, శివారెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న సాయిప్రతాప్‌రెడ్డి

క్రైస్తవుల అభ్యున్నతికి వైసిపి కృషి

గుత్తి : రాష్ట్రంలో క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి సిఎం జగన్ కృషి చేశారని వైసిపి క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షులు వైపి.బాబు పేర్కొన్నారు. పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో బుధవారం పాస్టర్ జె.సాల్మన్‌ను బాబు కలిసి వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలను వివరించారు. క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి పాటుపడుతున్న వైసిపి ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యేగా వై.వెంకటరామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాస్టర్లు వాసు అనిల్ కాంత్, అబ్రహమయ్య, సాల్మన్, జాకబ్, వైఎస్ బాబు చరణ్ దీప్, ప్రమోద్ పాల్గొన్నారు.



పాస్టర్ జె.సాల్మన్‌ను బాబు కలిసిన వైసిపి నాయకులు

వైసిపి గెలుపునకు సైనికుల్లా పని చేద్దాం

ప్రజాశక్తి-బెళుగుప్ప

రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన వైసిపి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు, ఎంపిపి పెద్దన్న పిలుపునిచ్చారు. మండలంలోని బుధవర్తి గ్రామంలో బుధవారం వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ 99 శాతం హామీలను నెరవేర్చాడన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వై.విశ్వేశ్వర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుందామని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు చిన్న మచ్చన్న, సింగిల్‌విండో డైరెక్టర్ శివలింగప్ప, ఎంపిటిసి వరలక్ష్మి, శ్రీరంగాపురం సర్పంచి సాహితీరెడ్డి, మారుతిరెడ్డి, పి.శ్రీనివాసులు, జె.రామేశ్వరరెడ్డి, శివ, ధనయ్య, చంద్ర, మల్లికార్జున, ఆవులెన్న సింగిల్‌విండో అధ్యక్షులు జి.శ్రీనివాసులు, శివన్న, తిప్పేస్వామి, బాబురెడ్డి, పురుషోత్తం, రాజు, అనిల్, కరుణాకర్, తిమ్మారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు

వ్యాపార తోవ.. సమాజ సేవ..!

అనాథ పిల్లలకు ఉచిత విద్య
శ్రీ వెంకటేశ్వర ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత తాళంకి వెంకటేష్ గుప్తా



వెంకటేష్ గుప్తా

పిల్లల కోసం ఏర్పాటు చేసిన గురుసదన్

ప్రజాశక్తి-అనంతపురం

వ్యాపారాలు అందరూ చేస్తుంటారు. కానీ అందులో వచ్చిన ఆదాయాన్ని సమాజ సేవ కోసం కొందరు ఉపయోగిస్తుంటారు. అలాంటి సామాజిక హితం కోరే వ్యక్తి అనంతరంపురం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దివ్య ఎలక్ట్రానిక్స్ అధినేత తాళంకి వెంకటేష్ గుప్తా. కుటుంబ సమస్యలు, పేదరికం తదితర కారణాలతో చాలా మంది చదువుకు దూరం అవుతుంటారు. ఇలాంటి వారిని అక్కున చేర్చుకుని వారిని సొంత పిల్లల్లా చూసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పే బాధ్యతను తాళంకి వెంకటేష్ గుప్తా తీసుకున్నారు.



ట్రస్ట్ ద్వారా చదివిస్తున్న పిల్లలతో గుప్తా దంపతులు

వ్యాపారంతో పాటు సమాజహితానికి పాల్పడే కార్యక్రమాలను చేస్తూ ఈయన ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో పలు విషయాలను పంచుకున్నారు. తన తండ్రి టివి.రత్నయ్యకు వ్యాపారవేత్తగా గుర్తింపు ఉందన్నారు. అనంతపురం నగరంలో డిగ్రీ వరకు చదువుకున్న తాను పదిమందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో వ్యాపార రంగంలో అడుగుపెట్టినట్లు చెప్పారు. 1984లో "దివ్య ఎలక్ట్రానిక్స్" సంస్థను ప్రారంభించినట్లు చెప్పారు. దివ్య ఎలక్ట్రానిక్స్ ద్వారా సుదీర్ఘకాలంగా ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడంతోపాటు రియల్ ఎస్టేట్ రంగంలో ముందుకెళ్లినట్లు చెప్పారు. 1995లో దివ్య ఎలక్ట్రానిక్ కూలర్స్ ఫ్యాక్టరీని నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పించామన్నారు. 1995 నుంచి 2005 వరకు అనంతపురంలో ఉన్న దివ్య ఎలక్ట్రానిక్స్ కూలర్స్ ఫ్యాక్టరీ మరింత విస్తతమైన సేవలు అందించడానికి హైదరాబాదుకు తరలించినట్లు తెలిపారు.

వ్యాపార దక్పథంతో కాకుండా తనవంతు సామాజిక సేవలు చేయాలన్న తలంపుతో సేవా కార్యక్రమాలు చేసేందుకు తన భార్య శశిగుప్తా, కుమారుడు సామ్రాట్‌గుప్తాతో కలిసి ముందడుగు వేశామన్నారు. శ్రీ వెంకటేశ్వర ఛారిటబుల్ ట్రస్ట్‌ను నెలకొల్పి ఎస్‌కెయు రోడ్డులో ఉన్న శివ బాలయోగి దేవాలయం సంయుక్త సహకారంతో అనాథ పిల్లలకు బాసటగా నిలిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే 12 మంది పిల్లలను ఎంపిక చేసి వారిని చదివిస్తున్నట్లు తెలియజేశారు. దాదాపు రూ.20 లక్షలు ఖర్చు చేసి పిల్లలు ఉండటానికి వసతిగహం ఇతర ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో తమ ఆశ్రమం పక్కన ఉన్న మోక్షత్ పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి సైతం ఈ సేవాకార్యక్రమంలో భాగస్వామి అయ్యారన్నారు. తమ ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సాధారణ, కంటివైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. దేవాలయాలకు సంబంధించి అవసరమైన వస్తువులను సమకూర్చడంలో తమవంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. నగరంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం ముందర ప్రజల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో శ్రీ వెంకటేశ్వర ఛారిటబుల్ ట్రస్ట్ ముందుకు వెళ్తోందని తెలియజేశారు.

వైసిపి పాలనలో దళితులకు అన్యాయం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

వైసిపి పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందనిఎమ్మార్పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షు లు మహానంది మల్లికార్జున పేర్కొన్నారు. మండలంలోని ముచ్చుకోట ఎస్సీ కాలనీలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ చంద్రబాబును కలిసి ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ తరఫున ఎన్డీఎ కూటమికి మద్దతు ఇస్తున్నట్లు తెలపడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన దళిత నాయకులపై అక్రమంగా కేసులు బనాయించడమే కాకుండా అనేకమంది దళితులను చంపి హత్యా రాజకీయాలు చేస్తున్నా సిఎం జగన్ పెదవి విప్పకపోవడం బాధాకరం అన్నారు. ఎస్సీలకు సంబంధించి 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి పలు విధాలుగా ఇబ్బంది పెట్టారన్నారు. ఇకనైనా మాదిగలు మేల్కొని 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు గట్టిగా బుద్ధి చెప్పాలని, మాదిగల అభ్యున్నతి, అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గార శ్రీరాములు, మండల యువసేన అధ్యక్షులు కిషోర్, తిరుపతి, తేజ పాల్గొన్నారు.